# ఇదే బాగుంది

**-ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి**

"పోస్ట్" అన్న కేక విని బయటకు వచ్చింది సీతమ్మ.

సెల్‌ఫోన్, ఆఫీసు పనుల హడావుడివల్ల ఉత్తరాల రావడం తగ్గిపోయింది. ఎప్పుడయినా ఫోన్ చేసినా పిల్లలు తనని అడిగి సెల్‌ఫోన్ తనకిచ్చే లోపలే వీళ్లు 'అమ్మ ఎక్కడో వుంది, మేం చెబుతాంలే నువ్వు ఫోన్ చేసావని' అనడమో, లేక అమ్మకి సరిగ్గా సెల్‌ఫోన్‌లో మాట్లాడడంరాదు.

చాలా డబ్బవుతుంది. ఖాళీగా ఉన్నప్పుడు ఉత్తరం వ్రాయి అనడమో చేసి పెట్టేస్తారు. ఒక్కోసారి వీళ్ల అనదల్చుకున్నది అవతలివాళ్లే అంటుంటారు. ఎవరికైనా నేర్పితేను, నేర్చుకుంటేను కదా వస్తుంది తనకయినా, వాళ్లకయినా. పుడుతూనే ఎవరూ పండితులు కారు కదా. ఏదెలా ఉన్నా ఉత్తరం అనగానే ప్రాణం లేచి వస్తుంది. ఫోనులా మధ్యవర్తులుండరు. కార్డు తనకే రాసాడు రెండో కొడుకు.

"అమ్మా! నీ కోడలు గర్భవతి కావున ఆఫీసులో, ఇంట్లో చేసుకోడం కష్టం కావడంవలన నువ్వు అన్నయ్యకు చెప్పి వెంటనే రావలసినది. (నిజానికి బెడ్‌రెస్టు తీసుకోమన్నా తీసుకోడం లేదు. పాపం ఆఫీసుకు వెళ్తానే ఉంది) అందువల్ల ఉత్తరం అందిన వెంటనే బయల్దేరి రాగలవు"

**ఇట్లు**
**సుందరం**

ఉత్తరం చదివి నిట్టూర్చింది సీతమ్మ. కాబట్టి, కావున ఇలాగే తప్ప ప్రేమగా పిలిచేది ఎవరూ లేరు.

అవసరానికి మనిషికి కావాల్సినప్పుడు మాత్రం అమ్మ గుర్తుకు వస్తుంది. ఉత్తరం చూసి వీళ్లేమి ఎగురుతారో? అనుకున్నట్లే అయింది. అనుకున్నట్లే కోడలు ఉత్తరం చూసి మూతి త్రిప్పింది.

"బెడ్ రెస్ట్ తీసుకోమంటే తీసుకోవచ్చుగా. ఎవరొద్దన్నారు? ఆఫీసు మానేస్తే జీతం రాదని భయం. అది కావాలి. మేం బ్రతకడంలా ఒంటి జీతంతో" అంది.

పెద్ద కొడుకు కూడా చిరాకుపడ్డాడు.

"ఇది మొదటిదే కదమ్మా వాళ్లకి. మనకేమిటి సంబంధం. వాళ్ల వాళ్లున్నారుగా అవసరమైనప్పుడు పంపాలి. మేమందరం వదిలి ఉండలేదా? పుట్టింటికి పంపమను. నీకుమాత్రం ఓపిక ఎక్కడుంది?" అన్నాడు.

"అసలే షుగరు, బిపితోటి వీకైపోయారు పాపం. ఇప్పుడు బెడ్‌రెస్టు. తరువాత చంటిపిల్ల, సెంటర్లో చేర్చాలంటే కనీసం ఏడాది రావాలి. అప్పుడైనా చేరిస్తే లేదంటే ఈవిడున్నారని చేర్చరో కూడా" జాలి కురిపించింది పెద్ద కోడలు.

"అమ్మా! ఇప్పుడే చెబుతున్నాను. నువ్వు వెళ్లకు. చెప్పేసేయ్. అంతగా అయితే పురిటి పదిరోజులు వెళ్లవచ్చులే" అన్నాడు ఫైనల్ చేసేస్తున్నట్లు లేచి వెళ్తూ. వెనకాలే కోడలు వెళ్లింది.

నిట్టూర్చింది సీతమ్మ. ఎవరి స్వార్థం వారిది. కూతురు పెళ్లిడుకొచ్చింది. భార్యకి పూజలు, ఆశ్రమాలు, స్వామీజీలు అటూ వ్యాపకాలు ఎక్కువ.

పని ఎక్కువ లేకపోయినా ఇంటికి, పెళ్లీడుకొచ్చిన కూతురికి కాపలా కావాలి. రోజులు బాలేవు.

అందుకే ఇద్దరూ తనమీద ప్రేమ కురిపిస్తున్నారు. కానీ చిన్నకొడుకు ఊరుకోడే.

"ఏం వాడికి చేయలా? వాడి పిల్లలు చిన్నప్పుడు చేయలేదా? నాదగ్గరకొచ్చేట్పటికి ఇలా అంటున్నాడు. వాళ్ల ఆవిడ ఇంట్లోనే ఉన్నా నువ్వు సాయం చేసావు. ఆవిడే కోడలా? మా ఆవిడ కాదా?" అని వంద చదువుతాడు.ఇక కోడలు సరేసరి.

"పుట్టింటివారే చేయాలని రూలుందా? ఎవరికి వీలైతే వాళ్లు చేయవచ్చు. పూర్వం అంటే చాలామంది పిల్లలుండేవారు కాబట్టి ఇద్దరు తరువాత అత్తింటివారు చూసేవారు. ఇప్పుడు కనేదే ఒకరో ఇద్దర్నో అయితే వాళ్ల వారసులకి వాళ్లు చేసేదేముంది. అయినా మా అమ్మా పెద్దదే. ఇప్పటికీ సంసార బాధ్యత వుంది. మీరైతే ఖాళీయేకదా. ఎక్కడుంటే ఏం? ఈయనే కొడుకేగా?" అని తన లా పాయింటు తను తీస్తుంది.

పేరుకే ఖాళీ. అసలు ఖాళీ మాత్రం సున్నా. భర్త ఉంటే ఏదో ఇల్లు, బాధ్యత అని వంక పెట్టవచ్చు.

కానీ ఇప్పుడో? ఎవరు పిలిచినా వెళ్లాలి. చాకిరీ చేయాలి తప్పదు. పెద్దకొడుకు అన్నట్లు నిజంగానే వంట్లో ఏం బాగుండడంలేదు. పైనుంచి అందరూ పని చేయించుకుంటూ దెప్పిపొడుస్తారు. తమాషా ఏమిటంటే వాళ్లల్లో ఎవరూ ఎవరినీ ఎదురుగుండా అనుకోరు. ప్రేమలు చూపించుకుంటారు. తనని పావును చేస్తారు.

ఇప్పుడు కూడా వాడు అన్నకి స్వయంగా రాయలేదు. తనకి వ్రాసాడు. వప్పించడం, వెళ్లడం, లేక వెళ్లినా, వెళ్లకపోయినా అటో ఇటో మూతి విరుపులు, సాధింపులు, కోపాలు భరించడం అన్నీ తన బాధ్యతలే.

ఇద్దరు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. కోడలు అలా చెప్తుందికానీ పూర్వం ఆచారంగా వియ్యాలవారు సాయం కావాలా అని మాటవరస్కైనా అడగలేదు. మీ బాధ్యత అన్నట్లు ఊరుకోవడమే కాక ఏడో నెల నుంచి మూడోనెలవరకు తను కీళ్లనొప్పులతో బాధ పడుతూన్నా తనవద్దే వదిలేసారు.

పెద్దకొడుకు పెద్దకూతురికి కూడా తనే చేసింది మునిమనవడు పుట్టాడు అనే ఆనందంతో కోడలు పూజలు, వ్రతాలతో ఎక్కువ ఉండకపోవడంవల్ల ఇంట్లో.

ఇప్పుడు ఈ రెండో కొడుకుకు కూడా మొదటిది తనే చూసింది అప్పుడు కొద్దిపాటి ఓపిక ఉండడంవల్ల, అందరికీ చేసి వాడికి చేయకపోతే బాధపడతాడనే భావంవల్ల. కానీ కలసిరాలేదు మొదటిది. ఇక రెండవది. అప్పుడు వియ్యపురాలు మొక్కుబడిగా వచ్చి వెళ్లింది. ఇప్పుడదీ లేదు.

కీళ్లనొప్పులకి తోడు బిపి, షుగరు కూడా వచ్చి చేరాయి. పెద్దకోడలు అన్నట్లు తన పనులకే తనకి కష్టంగా ఉంది. ఇప్పుడు రెండోవాడేమంటాడో. ఏం చెప్పాలో!

★★★

మనస్సు బాగాలేక విశ్రాంతిగా ఉంటుందని చిన్ననాటి స్నేహితురాలు సుందరమ్మ దగ్గరకు వృద్ధాశ్రమం వెళ్లింది.

ఆమెది ఇంకో సమస్య. తనని నా దగ్గర...నా



దగ్గర.. అని పిలిచేవాళ్లు ఎక్కువైతే, ఆమెను మావద్ద వద్దంటే మావద్ద వద్దు అనే పిల్లలు.

పిల్లలు ఇంట్లో పెట్టుకోకున్నా డబ్బుకి కొదవ చేయకపోవడంవల్ల సుందరమ్మ విడిగా వృద్ధాశ్రమంలో గది తీసుకుంది. సీతమ్మని చూసి సంతోషంగా ఆదరించింది.

టీవీ ఆపేసి మంచినీళ్లిచ్చింది.

"ఎలా ఉన్నావు?" అడిగింది సీతమ్మ.

ఎందుకంటే ఇక్కడికి వచ్చేటప్పుడు ఆమె పడిన బాధ వర్ణనాతీతం.

"బాగున్నావా?"

"తోస్తుందా?" అడిగింది ఆత్రంగా సీతమ్మ.

'తోచడమా? ఖాళీయే ఉండదు" అంటూ తన దినచర్య చెప్పింది.

అయిదింటికి లేచి ప్రార్ధన, తరువాత పాలు, కాఫీ ఏదయితే అది, తేలికపాటి అల్పాహారం తరువాత ఆరోగ్యరీత్యా అనువైన పనులు చేయడం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భజన, రాత్రి ఫలహారం లేదా భోజనం. ఎవరికి ఏం కావాలంటే అది. పదింటికి నిద్ర. ఇష్టమైన పనులు తోట పని, కుట్టు పని... ఎలా చేయాలనుకుంటే ఏదైనా చేయడం. వారానికి ఒకసారి డాక్టర్ వస్తాడు చెకప్ కోసం.అందులో వారు అందరూ ఒకే బాటలో, ఒకే వయసులో వున్నవాళ్లే కాబట్టి ఒకరి బాధలు ఒకరికి సులభంగా అర్ధమవుతాయి. అక్కడివారికి అక్కడివాళ్లే స్నేహితులు, ఆత్మబంధువులు. ఒకరికి ఏదైనా అయితే ఇంకొకరు సాయం చేస్తారు. అవసరమైన సేవలు కూడా అందిస్తారు. ఒకే కుటుంబంలా ఉంటారక్కడ.

మా అబ్బాయి చేర్చినప్పుడు భయపడ్డాను. కానీ మూతి విరుపులు, దెప్పిపొడుపులు, చాకిరీ లేకుండా ఇదే బాగుందే. ఒకవేళ చేసినా పుణ్యం పురుషార్ధం, కృతజ్ఞతా దక్కుతాయి" అంది సుందరమ్మ.

"వదినా! వార్డెన్ పిలుస్తోంది" అంటూ వచ్చింది ఇంకొక ఆశ్రమవాసి దుర్గమ్మ.

"వస్తాను. చాలాసేపయింది వచ్చి" అంటూ లేచింది సీతమ్మ.

రాత్రంతా దీర్ఘంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది సీతమ్మ.

***

"అబ్బాయ్! నన్ను వృద్ధాశ్రమంలో చేర్చరా" అంది సీతమ్మ.

"ఎందుకమ్మా. నీకెందుకా ఖర్మ? ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లలు చూడనివాళ్లకి వృద్ధాశ్రమాలు అవసరం. నీకెందుకు?" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆడపిల్లలు కూడా పిలుస్తారు నిజమే. ఉద్యోగస్థులు కాబట్టి అవసరాలకి అత్తగార్లని పిల్లలని చూడమంటే బాగుండదని తనని పిలుస్తారు.

"నువ్వు చేర్పిస్తావా? నేనే వెళ్లి చేరనా?"అడిగింది స్థిరంగా.

తెల్లబోయాడు శ్రీధరం. తప్పనిసరై తల్లిని తీసుకెళ్లి వృద్ధాశ్రమంలో చేర్పించాడు.

'అమ్మయ్య' అనుకుంది. పదమూడేళ్లకే పెళ్లయితే మొదలైన చాకిరీ పెద్ద కోడలుగా మరుదులు, ఆడబడుచు లక్ష్మి తరువాత పిల్లలకి, పిల్లల పిల్లలకి కూడా అయింది. తనకేమో కీళ్లనొప్పులు... వాళ్ల వెంట పరుగెత్తగలదా?

ఇంకా చేయాలంటే తనవల్ల అవుతుందా? తన వెనుక ఎన్ని విమర్శలు వస్తాయో తెలుసు. అందరూ పిల్లలు చూడక వృద్ధాశ్రమంలో చేరితే తను అందరూ రమ్మంటున్నా తను వెళ్లిందని, పని చేయాలంటే భయమని... అంటూ ఏదో రకరకాల పుకార్లు పుట్టిస్తారు. కానీ తనకెప్పుడు విశ్రాంతి అని ఆలోచించరు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? ఇక చివరి దశకు వచ్చాం. ఇక బంధాలు, బాధలు గురించి ఆలోచించకు. ఏదేమైనా నువ్వు రావడం చాలా ఆనందంగా ఉంది సీతా" అంటూ చేయి పట్టుకుంది సుందరమ్మ ఆప్యాయంగా.

ఇద్దరిదీ ఒకే గది.

ఆమె పిలుపుతో గతకాలపు జ్ఞాపకాలు, వైభవం గుర్తుకు రాగా సీతమ్మకి మొహంమీద చిన్న చిరునవ్వు మెదిలింది.

ఒకవేళ అందరికీ ఇన్ని సమస్యలు, ఇలా అనిపించకనూ పోవచ్చునేమో!

ఎందుకంటే అన్ని సమస్యలకి పరిష్కారం ఒక్కటే కాదు కదా.

కానీ తనకి మాత్రం ఇదే బాగుంది అనుకుంది సీతమ్మ.

★



## ఆశల పల్లకిలో జియా

'నిశ్శబ్ద్' తర్వాత తన రెండో చిత్రం 'గజినీ' కోసం ఆశగా ఎదురుచూస్తున్న జియాఖాన్‌కి చిన్నప్పటినుంచీ 'ఆస్ట్రోనాట్' కావాలని వుండేదిట. కానీ అంతరిక్షంలోకి వెళ్లలేకపోయినా బాలీవుడ్ ద్వారా తారాలోకంలోకి వచ్చిపడింది. అయితే తను ఇప్పటికీ అంతరిక్షానికి సంబంధించిన ఏ వార్త విన్నా దాని తాలూకు పూర్తి పాఠాన్ని తెలుసుకుంటుందిట. 'గజినీ'లో (తమిళంలో నయనతార వేసిన పాత్ర) ఆమీర్‌తో నటిస్తున్న జియా కెరీర్ ఈ సినిమాతో అంతరిక్షంలోకి దూసుకెళుతుందేమో!

